క్లుప్తంగా

వీధిలైట్లు వెలిగేలా చర్యలు చేపట్టండి

సింగరాయకొండ: గ్రామ పంచాయతీ పరిధిలో వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుకు ఒంగోలు డీఎల్‌పీఓ పద్మ సూచించారు. మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ గ్రామంలోని పకీరుపాలెం, బ్రాహ్మణకాలనీ, సాయినగర్‌లో వీధిలైట్లు సక్రమంగా వెలగడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, వెంటనే సమస్య పరిష్కరించాలని కార్యదర్శిని ఆదేశించారు. పంచాయతీలో సర్టిఫికెట్లకు అదనంగా డబ్బు వసూలు చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మూలగుంటపాడు కార్యదర్శి రామారావు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ తనిఖీ



రేషన్ పంపిణీని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ కిరణ్ కుమార్

కొండపి(సింగరాయకొండ): కొండపి మండలంలోని కొండపి, ఇలవర, నెన్నూరుపాడులో రేషన్ పంపిణీని తహసీల్దార్ కిరణ్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులకు రేషన్ సక్రమంగా అందించాలని సూచించారు. రేషన్ పంపిణీ సక్రమంగా జరుగుతుందా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కొండపి వీఆర్‌ఓ సుశీల, ఇతర వీఆర్‌ఓలు ఉన్నారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల గుర్తింపు



ఇంటింటి సర్వేలో ఐఈఆర్‌పీలు

కనిగిరి రూరల్: ప్రత్యేక అవసరాలు కలిగిన (0–18 ఏళ్ల లోపు) పిల్లలను మండలంలో 62 మందిని గుర్తించినట్లు మండల విద్యాశాఖ అధికారులు ఎంపీ సుబారావు, యుపీ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడారు. మే 1 నుంచి జూన్ 9 వరకు బడి ఈడు పిల్లల గుర్తింపు కార్యక్రమం (డోర్ టు డోర్ సర్వే) గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు జి. గోపాల కృష్ణ, ఎం. సైమన్‌లు సర్వే ద్వారా విద్యార్థులను గుర్తించి, వారిని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో పేర్లు నమోదు చేస్తామని వివరించారు.

12 నుంచి పాఠశాలల పునఃప్రారంభం

కొమరోలు: ఈ నెల 12వ తేదీ నుంచి ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నట్లు మండల విద్యాశాఖాధికారి బి.వెంకటరత్నం తెలిపారు. మండలంలో ఎక్కడైనా ప్రైవేటు పాఠశాలలు ముందుగా తెరిస్తే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 12వ తేదీన మాత్రమే పాఠశాలలు తెరవాలన్నారు.

ఆర్‌బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

పొదిలి: రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి జైనులాబ్దిన్ తెలిపారు. శుక్రవారం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు 50 శాతం సబ్సిడీపై అందజేస్తున్నట్లు తెలిపారు. 12 క్వింటాళ్ల విత్తనాలు రాగా పంపిణీ చేస్తున్నామని, మరో 15 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. జనుములు కేజీ రూ.88, జీలుగ కేజీ రూ.88, పిల్లిపెసర కేజీ రూ.134 కాగా 50 శాతం సబ్సిడీపై రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో వచ్చి ఆర్బీకేలో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని ఏఓ కోరారు.

మార్కాపురంలో మోస్తరు వర్షం



వేములకోటలో వర్షం పడుతున్న దృశ్యం

మార్కాపురం: నైరుతి రుతు పవనాల ప్రభావంతో గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షాలకు కొండవాగు, ఉప్పువాగు, గుండ్లకమ్మలో నీరు చేరింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు.

ఘనంగా నాగూర్ మీరావలి గంధ మహోత్సవం



ప్రత్యేక పూజలు చేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్



దర్గా వద్ద భక్తుల సందడి

కనిగిరి రూరల్: మండలంలోని పోలవరంలో హజరత్ శ్రీ శ్రీ నాగూర్ మీరా వలి గంధ మహోత్సవం శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఉరుసు సందర్భంగా హజరత్‌వారి దర్గాను విద్యుత్ దీప, పూల అలంకరణతో తీర్చిదిద్దారు. అనంతరం స్వామి వారి జెండాలను గ్రామంలో అత్యంత నియమ నిష్టలతో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. మొక్కులు ఉన్నవారు హజరత్ వారి దర్గాపై పూల్ చాదర్ ఉంచి, నైవేద్యాన్ని సమర్పించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది.

ప్రత్యేక పూజలు చేసిన చైర్మన్ అబ్దుల్ గఫార్

ఉరుసు సందర్భంగా నాగూర్ మీరా స్వామి దర్గాలో కనిగిరి మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ ప్రత్యేక పూజలు చేశారు.

కార్యక్రమంలో న్యాయవాది సుమైర్, బన్ను, నూర్ బాషా సంఘం జిల్లా నాయకులు ఎస్‌కే బారాయిమామ్, ఎరెక్టర్ చిమ్మిడి శెట్టి శ్రీనివాసుల నాయుడు, మాజీ వార్డు సభ్యుడు సయ్యద్ నాయబ్ రసూల్, మాజీ సర్పంచ్ అమర్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

85 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సందీప్

హనుమంతునిపాడు: మండల పరిధిలోని కొండారెడ్డి పల్లి గ్రామంలో ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య క్యాంప్‌లో భాగంగా శుక్రవారం 85 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు సూచలిచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 85 మందికి జలుబు, దగ్గు, జ్వరం, బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

పంపిణీకి సిద్ధంగా ఉన్న పాఠ్య పుస్తకాలు



పాఠ్య పుస్తకాలు సర్దుతున్న సీఆర్పీలు

హనుమంతునిపాడు: ఈ విద్యా సంవత్సరానికి వచ్చిన పాఠ్యపుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఎంఈఓ జి.పెద్దిరాజు, ఎస్. రమణయ్య తెలిపారు. 1 నుంచి 10వ తరగతి వరకు 45 శాతం పుస్తకాలు వచ్చాయన్నారు. 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు అన్ని సబ్జెక్టులకు సంబంధించి మొదటి విడతగా 6145 వచ్చాయి. రెండో విడతగా 8,10 తరగతులకు సంబంధించిన పుస్తకాలు 6511 పాఠ్య పుస్తకాలు వచ్చాయన్నారు. 9వ తగతికి సంబంధించి ఒక్క పుస్తకం కూడా రాలేదన్నారు. నోట్ బుక్ 16026 వచ్చాయన్నారు. పాఠ్యపుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలి



పచ్చిరొట్ట ఎరువులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్

కొండపి (సింగరాయకొండ): పొగాకు గ్రేడింగ్ సమయంలో అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలని, అలాంటి బేళ్ళకు వేలంలో అధిక ధరలు పొందవచ్చని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం రైతులకు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం నిర్వహించిన వేలంలో అయ్యప్పరాజుపాలెం, నరసరాజుపాలెం, పెద్దకళ్ళగుంట గ్రామాలకు చెందిన రైతులు 1142 బేళ్ళు వేలానికి తీసుకొని రాగా 1084 బేళ్ళు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 58 బేళ్ళను తిరస్కరించారు. గరిష్ట ధర రూ. 321, కనిష్ట ధర రూ. 205 , సరాసరి ధర రూ. 286.03.వేలంలో 21 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులపై అవగాహన

స్థానిక పొగాకు వేలం కేంద్రంలో పొగాకు రైతులకు వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ పచ్చిరొట్ట ఎరువులపై అవగాహన కల్పించారు. రైతులతో మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుతో ముందడుగు వేయవచ్చన్నారు. పచ్చి రొట్ట వాడడం వలన అనేకమైన లాభాలున్నాయని ఆయన రైతులకు తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులకు వాడే పైర్లను రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో బోర్డ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

7,8, 9 తరగతుల సీట్ల భర్తీకి ప్రకటన

వలేటివారిపాలెం: మండలంలోని చుండి ఆదర్శ పాఠశాల 2024–25 విద్యా సంవత్సరానికి గాను 7,8,9వ తరగతిలో గల మిగతా సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ లోపు విద్యార్థులు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. దరఖాస్తు చేయదలచిన వారు విద్యార్థి, తల్లి , తండ్రి ఆధార్ కార్డుల జెరాక్స్‌లు, రెండు ఫొటోలు పాఠశాలకు తీసుకొచ్చి ఆప్లై చేసుకోవాల్సిందిగా తెలిపారు. పరీక్షలు నిర్వహించి మెరిట్ ప్రకారం సీట్లు భర్తీ చేస్తామని తెలిపారు. 7వ తరగతి స్టేట్ సిలబస్ అలాగే 8,9వ తరగతుల విద్యార్థులకు సెంట్రల్ సిలబస్‌పై పరీక్షలు నిర్వహించనునట్లు తెలిపారు.

కనిగిరిలో బీజేపీ శ్రేణుల సంబరాలు

కనిగిరి రూరల్: ఎన్డీఏ కూటమి కన్వీనర్‌గా ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నిక కావడంతో కనిగిరిలో బీజేపీ శ్రేణులు సంబరాలు చేశారు. శుక్రవారం కేక్ కట్ చేసి, స్వీట్లు పంచి, బాణసంచా కాల్చారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాల శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత ప్రజాధారణ కలిగిన నాయకుడు నరేంద్ర మోదీ అన్నారు. తిప్పలూరు శ్రీనివాసులు, ముక్కు వెంకటరెడ్డి, వెంకటేష్, ఓలేటి రాధా కృష్ణమూర్తి, మస్తానయ్య, మాలకొండయ్య, మోహన్, కేశవ, ఈశ్వరయ్య నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లిలో మోస్తరు వర్షం

పీసీపల్లి: గత కొద్ది రోజులుగా వీస్తున్న వేడి వడగాల్పులకు శుక్రవారం ఉపశమనం లభించింది. మండలంలో శుక్రవారం మోస్తారు వర్షం కురవడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. రోహిణి కార్తె వలన ఎండ వేడిమితో ఉక్కిరి బిక్కిరైన ప్రజలకు ఈ వర్షం ఎంతో ఊరటనిచ్చింది. పిల్లలు, యువకులు వర్షంలో తడిసి సేదతీరారు.

శివారు ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి



వార్డులో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్, కౌన్సిలర్

కనిగిరి రూరల్: శివారు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రత్యేక దృష్టి పెడతానని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని గార్లపేట రోడ్డులోని బీసీల కాలనీలో శుక్రవారం కౌన్సిలర్ రామనబోయిన ప్రశాంతి శ్రీనుతో కలిసి పర్యటించారు.

రోడ్లు, కాలువలు, డ్రైనేజీ, పారిశుధ్యం, విద్యుత్ దీపాలు, నీటి సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో మాట్లాడి తక్షణ పరిష్కారంకు చర్యలు తీసుకుంటానన్నారు.

తైక్వాండో విజేతలకు బెల్టులు ప్రదానం



సాధించిన బెల్ట్‌లతో విద్యార్థులు

కొండపి(సింగరాయకొండ): మండలంలోని కట్టవారిపాలెం గ్రామంలో వేసవి శిక్షణ శిబిరంలో నెల రోజుల నుంచి తైక్వాండో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు శుక్రవారం పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు ఎల్లో, గ్రీన్ బెల్టులు ప్రదానం చేశారు. అంతర్జాతీయ తైక్వాండో శిక్షకుడు ఉన్నం మారుతీ ప్రసాద్ మాట్లాడుతూ.. మొత్తం 50 మంది విద్యార్థులకు తైక్వాండో పోటీలు నిర్వహించామని, వారిలో 18 మంది వైట్ బెల్ట్ నుంచి ఎల్లో గ్రేడ్ బెల్ట్‌కు, 11 మంది ఎల్లో బెల్ట్ నుంచి గ్రీన్ బెల్ట్‌కు అర్హత సాధించారని వివరించారు. గత ఏడేళ్ల నుంచి వేసవి సెలవుల్లో విద్యార్థులకు తైక్వాండో, యోగా శిక్షణకు ఆర్థిక వనరులు సమకూరుస్తున్న ఎన్‌ఆర్‌ఐలు ప్రసాద్, వెంకట్, మన ఊరి వికాసం కార్యకర్తలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో శిక్షకులు కిషోర్, లీలామైత్రి బాలాజీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొండపిలో భారీ వర్షం



పొదిలి రోడ్‌లో నిలిచిన వర్షం నీరు

కొండపి (సింగరాయకొండ): కొండపి మండలంలో అన్ని గ్రామాల్లో మెరుపులు, గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో అన్ని గ్రామాల్లోని రహదారులు వర్షపు నీటితో నిండాయి. స్థానిక పొదిలి రోడ్‌లో పోలీస్ స్టేషన్ దగ్గర మోకాటి లోతు నీరు ఉండంతో వాహన దారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కొన్ని వాహనాలకి సైలెన్సర్‌లలో నీరు పోవడంతో వాహనాలు అక్కడే ఆగిపోయాయి. దీంతో వాహనాలను తోసుకుంటూ రిపేర్ దుకాణాలకు తీసుకొని రిపేరు చేయించుకొని వెళ్లారు.

సేంద్రియ ఎరువులతో భూములు సారవంతం

- రసాయనిక ఎరువులతో పెట్టుబడి భారం
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు
- సేంద్రియ ఎరువులతోనే భూమికి మెండుగా పోషకాలు



పొలంలో తోలిన సేంద్రియ ఎరువు

కొనకనమిట్ల: భూములు సారవంతమై అధిక దిగుబడి సాధించాలంటే సేంద్రియ ఎరువుల వినియోగం తప్పనిసరి. పూర్వపు రోజుల్లో రైతులంతా వేసవిలో తమ పొలాలల్లో సేంద్రియ ఎరువులు చల్లి సాగుకు సిద్ధం చేసేవారు. కాలక్రమంలో రసాయన ఎరువుల వినియోగం పెరగడం, పెట్టుబడి భారంగా మారడంతో మళ్లీ పాత పద్ధతినే అనుసరించేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. వారి ఆలోచనలకు అనుగుణంగానే వ్యవసాయశాఖ అధికారులు సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో సేంద్రియ ఎరువులకు డిమాండ్ పెరుగుతోంది.

భూసారం పెంపుపై దృష్టి

భూసారం పెంపొందించేందుకు రైతులు పశువుల పేడ, గొర్రెలు, మేకల ఎరువు, చెరువులు, కుంటల్లో పేరుకుపోయిన రేగడి మట్టిని పొలాలకు తోలుతున్నారు. పశు సంపద లేని రైతులు మాత్రం సేంద్రియ ఎరువును కొనుగోలు చేసి పొలాలకు తరలిస్తున్నారు. ఖరీఫ్, రబీ పంటలు సాగు చేసే రైతులు ముందస్తుగా ఎరువులు తోలి పొలాలను సిద్ధం చేస్తున్నారు. తొలకరి వర్షాలు పడిన తరువాత జిల్లాలో ఎక్కువగా కంది, పత్తి, వేరుశనగ, సజ్జ, కూరగాయల పంటలు సాగు చేస్తారు. అంతే కాకుండా అంతర పంటల సాగుకు రైతులు మొగ్గు చూపుతారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుండటం కూడా రైతుల్లో మార్పునకు ఓ కారణం.

రసాయన ఎరువులతో అదనపు భారం

పంటలకు రసాయనిక ఎరువులు వాడే రైతులు అధిక ఖర్చు చేయాల్సి వస్తోంది. తద్వారా పెట్టుబడి పెరగడమే కాకుండా చీడ పురుగులు, తెగుళ్లు వీడక పంట దిగుబడి తగ్గుతోంది. ఈ విషయాలపై వ్యవసాయశాఖ అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు జాగ్రత్తలు తెలియజేస్తున్నారు. పంట సాగు, ఎరువుల వాడకం, మట్టి నమూనాలు తదితర విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు.

సేంద్రియ ఎరువులతో లాభాలు

సేంద్రియ ఎరువులు వాడటం వలన భూమి సారవంతంగా ఉంటుంది. నీటి సామార్థ్యాన్ని పెంచుతుంది. పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు వృద్ధి చెంది పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. సేంద్రియ ఎరువుల వినియోగంతో భూమిలో చౌడు, ఉప్పు లవణాలు తగ్గి పంట ఉత్పత్తి పెరుగుతుంది. మొక్కలకు అవసరమైన పొటాషియం, నత్రజని, కాల్షియం, బోరాన్, జింక్ లాంటి పోషకాలు సేంద్రియ ఎరువుల్లో లభిస్తాయి. అంతేకాకుండా చీడ పీడలను నివారించడానికి దోహదపడతాయి.

> **సేంద్రియ ఎరువులు వాడే రైతులకే అధిక దిగుబడి**
>
> సేం ద్రియ ఎరువులు వాడే రైతులకు పంట దిగుబడి ఎక్కువగా వస్తుంది. ఆ దిశగా రైతులకు అవగాహన కలిపిస్తున్నాం. గ్రామాల్లో రైతులకు వర్మీ కంపోస్టు తయారీ విధానం, భూసార పరీక్షలు, సేంద్రియ ఎరువుల వాడకం, రైతులకు సబ్సిడీతో ఇచ్చే పరికరాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఖరీఫ్ సాగుకు సంబంధించి అవసరమైన విత్తనాలను అందించేందుకు చర్యలు చేపట్టాం. అలాగే జింక్, జిప్సం, బోరాన్ అందుబాటులో ఉంచడానికి చర్యలు తీసుకుంటున్నాం.
>
> – ప్రసన్న రంగలక్ష్మి, ఏఓ



పొలంలో వేసేందుకు పశువుల ఎరువు తోలుతున్న రైతులు



పొలంలో ఎరువు చల్లుతున్న మహిళలు

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

ముండ్లమూరు: మండలంలోని గుండ్లకమ్మ, చిలకలేరు నదీ ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ ఆర్‌ఐ జి.మురళీకృష్ణ హెచ్చరించారు. మండలంలోని జమ్మలమడక, పోలవరం, మారెళ్ల, తమ్మలూరు గ్రామాల్లో ఇసుక ప్రాంతాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలకలేరు, గుండ్లకమ్మ ప్రాంతాల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారంతో ఆయా ప్రాంతాలపై నిఘా పెట్టామన్నారు. నిబంధనలు అతిక్రమించి గుట్టుచప్పుడు కాకుండా ఇసుకను తరలించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ తిరుపతిరావు, ఎస్‌ఈబి సీఐ బి.సుందరరామయ్య, తహసీల్దార్ మధుబాబు, ఇరిగేషన్ ఏఈ మధుసూదన్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.శ్రీనివాసరావు ఉన్నారు.

పబ్లిక్ నోటీసు

ఇందు మూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియచేయునది ఏమనగా మా క్లయింట్ అయిన కనిగిరి గ్రామ కాపురస్తుడు **ముదిరెడ్డి వెంకట రెడ్డి** గారి కుమారుడు **చలమారెడ్డి** గారులోగా క్రింది తెలిపిన షెడ్యూలు ఆస్తిని, సదరు ఆస్తి అసలు హక్కు దారుడైన **వేమూరి కృష్ణమూర్తి ఉరఫ్ సత్యానంద భారతి** గారి వారసుల నుండి **తే. 10-02-2011** న కొనుగోలు చేసి రిజిష్టర్ విక్రయ పత్రము పొంది అన్నీ విధములా అనుభవించుకొనుచున్నారు. ఇటీవల కొందరు వ్యక్తులు, షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎటువంటి హక్కు అనుభవం లేకుండా తప్పుడు పత్రములు సృష్టించి ఇతరులను మభ్యపెట్టి విక్రయించాలని మరియు తప్పుడు రిజిష్టర్లు తయారు చేయవలెనని ప్రయత్నిస్తున్నారు. కావున యావన్మందికి తెలియచేయునది ఏమనగా షెడ్యూలు ఆస్తికి మా క్లయింటుకు మాత్రమే అన్నీ హక్కులు కలిగివున్నందున ఎవరేని షెడ్యూలు ఆస్తి గురించి ఏమేని లావాదేవీలు జరిపిన, ఎటువంటి అగ్రిమెంట్లు, రిజిష్టర్ విక్రయ పత్రములు వగైరాలు ఏవిచేసినన్నూ చేయబోయినను, అవి అన్ని కూడా చెల్ల నేరవు అని మరియు అటువంటి పత్రములు, లావాదేవీలు, ఏవి కూడా మా క్లయింటు ని బద్ధపరచజాలవని ఇందు మూలంగా తెలియచేయడమైనది. అట్లు ఏదేని జరిపిన, జరపబోవు కష్టనష్టములకు వారు బాధ్యులవుదురు. అంతే కాక మా క్లయింటు తీసుకొనుచట్ట పరమైన సివిల్, మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యత వహించవలసి వస్తుందని ఈ పబ్లిక్ నోటసు ద్వారా యావన్మందికి తెలియచేయడమైనది.

షెడ్యూల్: ప్రకాశం జిల్లా, కనిగిరి మండలం, కనిగిరి మున్సిపాలిటీ ఏరియాలో చేరిన మాచవరం మజారా శంఖవరం గ్రామంలో నెం.367 కు పట్టా దాఖలా కొరుమెట్ట సనెం.328/2 కు య.0.55 సెంట్లు మరియు డిటో పట్టా దాఖలా సనెం.329 రు య 0.54 సెంట్లు గల విస్తీర్ణము.

కనిగిరి
తేది: 07-06-2024

షేక్ మహమ్మద్ వలి, B.A., B.L.,
అడ్వకేట్, కనిగిరి, ప్రకాశం జిల్లా.

ఘనంగా విశాల్ జన్మదిన వేడుక

మార్కాపురం: స్థానిక శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కుమారుడు, కళాశాల సెక్రటరీ విశాల్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, డీన్ మస్తానయ్య, సిబ్బంది జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పీపీఎస్ నాయక్, వైవీ ఆదిసత్యనారాయణ, ఎం.వెంకటేశ్వర్లు, టీపీఓ ప్రొఫెసర్ డి.కుమార్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.